
సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సరూర్‌నగర్ మాజీ కార్పొరేటర్ అనితాదయాకర్‌రెడ్డి దంపతులు

## కాంగ్రెస్‌లో చేరిన మాజీ కార్పొరేటర్

ఎల్బీనగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితాదయాకర్‌రెడ్డి దంపతులు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, మేయర్ విజయలక్ష్మి, మహేశ్వరం నియోజక వర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వారికి సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించుకుని రావాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సరూర్‌నగర్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మంచినీళ్ల సుదర్శన్ ముదిరాజ్, కోశాధికారి తాటికొండ రాఘవేంద్రగుప్తా తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.


ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

## కమల్‌నగర్, ముసానగర్ బస్తీల్లో ఎంఐఎం ఎన్నికల ప్రచారం

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆజంపుర డివిజన్‌లోని పలు బస్తీల్లో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల బుధవారం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ ఎంఐఎం అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి మద్దతు నిచ్చి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. స్థానికంగా ఎలాంటి సమస్యలున్నా అన్ని వేళల్లో ఎంఐఎం కార్యకర్తలతో పాటు తాను కూడా ముందుండి పరిష్కరిస్తున్నానని ఆయన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బస్తీలోని ఓటర్లు ఎంఐఎంకు ఓటు వేసి ఎంపీగా అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలని కోరారు. డివిజన్‌లోని కమల్‌నగర్, ముసానగర్, రసూల్‌పుర, వినాయకవీధి బస్తీలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



మధుయాష్కీగౌడ్ తల్లి అనసూయ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ తదితరులు

## మధుయాష్కీగౌడ్‌ను పరామర్శించిన నేతలు

హయత్‌నగర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్‌ను బుధవారం పలువురు నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా మధుయాష్కిగౌడ్ తల్లి అనసూయ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్ రెడ్డి, పార్టీ ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావు, సంరెడ్డి భుజంగరెడ్డి, యూత్ కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి సురభి ద్వివేది, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, జక్కిడి శివచరణ్‌రెడ్డితో పాటు పలువురు పరామర్శించారు.


ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న ప్రభాకర్‌రెడ్డి

## యానాల ప్రభాకర్‌రెడ్డికి ఉత్తమ సేవా అవార్డు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ ప్లాజాలో ఉగాది పురస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మమత ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సంస్థల వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డికి 2024కు గాను ఉత్తమ సేవా అవార్డును ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ సుధా, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి కె.మదన్‌మోహన్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి విద్యారంగంతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సీఈవో సత్యవోలు రాంబాబు, గుమ్మి రాంరెడ్డి, రవిచరణ్ పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్‌లోని ఆండాళ్ నిలయం నిర్వాహకురాలు రూపాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిందాకృప చలివేంద్రాన్ని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ బుధవారం ప్రారంభించారు. ఎండవేడి నుంచి పాదాచారులు, వాహనాదారులకు కొంత వరకు ఉపశమనం కల్పించేందుకు 16సంవత్సరాలుగా రిందాకృప చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశంసించారు.


చలివేంద్రం ప్రారంభోత్సవంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

## బెల్టుషాపులపై ఎస్ఓటీ దాడులు

- రూ.1.93 లక్షల విలువైన మద్యం స్వాధీనం

హైదరాబాద్ సిటీ/సనత్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా మద్యం దుకాణాలు బంద్ కావడంతో బెల్టుషాపుల్లో విక్రయాలు జోరందుకున్నాయి. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని బెల్టుషాపులపై దాడులు నిర్వహించిన సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు రూ.1.93 లక్షల విలువైన 300 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు ఆర్‌సీపురం, చందానగర్ ప్రాంతాల్లో ఉన్న బెల్టుషాపులపై దాడులు చేశారు. కొల్లూరు, అత్తాపూర్, మోకిల పరిధిలోని బెల్టుషాపులపై రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు దాడిచేశారు. పేట్‌బషీరాబాద్, అల్వాల్, సూరారం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని బెల్టుషాపులపై మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు దాడిచేశారు. కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, సనత్‌నగర్, జీడిమెట్ల పరిధిలోని బెల్టుషాపులపై బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు చేశారు.


వనస్థలిహిల్స్ కాలనీలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రవికుమార్


మీర్‌పేట్‌లో సీతారాముల కల్యాణ వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి


కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో కల్యాణ వేదిక వద్దకు తలంబ్రాలు పట్టువస్త్రాలతో వస్తున్న ఈఓ శ్రీనివాసశర్మ, చైర్మన్ రఘుమారెడ్డి, ధర్మకర్తలు


ఉప్పరిగూడ రామాలయానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకువస్తున్న డీసీపీ జానకీ దరావత్


సరూర్‌నగర్ రామాలయంలో వేడుకల్లో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ మహేందర్‌యాదవ్, శంకర్‌యాదవ్


అష్టలక్ష్మి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం


ఎల్బీనగర్ సాయిబాబా ఆలయంలో కల్యాణోత్సవం


దిల్‌సుఖ్‌నగర్ సాయి సంస్థాన్‌లో సీతారామాంజనేయ విగ్రహాలను కల్యాణ మహోత్సవానికి తీసుకువస్తున్న సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ గుండా మల్లయ్య దంపతులు

# కమనీయం.. రాములోరి కల్యాణం

- అంగరంగ వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు

జోన్ బృందం : శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లోనూ సీతారాముల కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో వేలాది మంది శ్రీరామ భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం సీతారాములకు తలంబ్రాలు పోశారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. చంపాపేట డివిజన్ మారుతీనగర్‌కాలనీలోని శ్రీబంధన ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మీర్‌పేట్‌లో మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లిలో భువనగిరి ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్, తొర్రూర్‌లో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, సరూర్‌నగర్ హుడా కాంప్లెక్స్‌లోని రామాలయంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, కార్పొరేటర్లు, సరూర్‌నగర్‌లోని బంగారు మైసమ్మ కాశీ వైద్యనాధేశ్వర ఆలయంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి కల్యాణ వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.


హుడా కాంప్లెక్స్ రామాలయంలో రాములోరి కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, కార్పొరేటర్ రాధధీరజ్‌రెడ్డి తదితరులు


మన్సూరాబాద్ సాయిబాబా ఆలయంలో రంగారెడ్డి, కార్పొరేటర్ నర్సింహారెడ్డి, ఈటల జమున


టీచర్స్ కాలనీ ఫేజ్-2లో బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, కాలనీ అధ్యక్షుడు శివ ముదిరాజ్


వనస్థలిపురంలోని రామాలయంలో వేడుకల్లో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి


సైదాబాద్‌లో కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి దంపతులు


శాలివాహననగర్ కాలనీలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, కమిటీ చైర్మన్ మాణిక్‌రెడ్డి, కార్యదర్శి శంకర్ తదితరులు


గోదాసమేత పద్మావతి వేంకటేశ్వరాలయంలో వేడుకలకు హాజరైన భక్తజనం


అన్మగల్ హయత్‌నగర్ వేడుకల్లో కార్పొరేటర్ జీవన్‌రెడ్డి దంపతులు


కవాడిపల్లిలోని ఆలయంలో సీతారాములు


కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి కమలా సుధీర్‌రెడ్డి


ఓల్డ్‌మలక్‌పేటలో కల్యాణంలో భక్తులు


బాలాపూర్‌లోని దేవతలగుట్టపై కల్యాణ వేడుకలకు బడంగ్‌పేట్ నుంచి ఊరేగింపుగా వెళ్తున్న గుట్ట పరిరక్షణ సమితి ప్రతినిధులు


రెడ్డిబస్తీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి దంపతులు

# 17 ఎంపీ స్థానాల్లో ధర్మసమాజ్ పార్టీ పోటీ

- 14 మంది అభ్యర్థుల జాబితా విడుదల
- కంటోన్మెంట్ ఉప ఎన్నిక బరిలో నర్సింగ్‌రావు

బర్కత్‌పుర, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ధర్మసమాజ్ పార్టీ 17 ఎంపీ స్థానాలలో పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ వెల్లడించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గుండాటి నర్సింగ్‌రావు పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ తమ పార్టీ అభ్యర్థులకు చెప్పుల గుర్తు కేటాయించిందన్నారు. బుధవారం బర్కత్‌పురలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో 14 మంది అభ్యర్థుల తొలి జాబితాను ఆయన ప్రకటించారు. అగ్రవర్ణ పాలకులను చెప్పులతో గ్రామాల నుంచి తరిమికొడతామని ఆయన హెచ్చరించారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకే కోవకు చెందినవని, ఆ పార్టీలను ఓడించేందుకే ఎన్నికల బరిలో దిగుతున్నట్లు తెలిపారు. భువనగిరి ఎంపీ అభ్యర్థిగా కొంగరి లింగస్వామి, సికింద్రాబాద్ - రాసాల వినోద్‌యాదవ్, చేవెళ్ల - తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్, మెదక్ - అన్నెల లక్ష్మణ్, వరంగల్ - మేకల సుమన్, హైదరాబాద్ - గడ్డం హరీష్‌గౌడ్, నల్లగొండ - తలారి రాంబాబు, మహబూబాబాద్ - రవ్వ భద్రమ్మ, మహబూబ్‌నగర్ - గంట్లవెల్లి రాకేష్, మల్కాజ్‌గిరి - బోయిన్ దుర్గాప్రసాద్‌యాదవ్, కరీంనగర్ - చిలువేరు శ్రీకాంత్, నిజామాబాద్ - కండెల సుమన్, జహీరాబాద్ - టి. దేవశిఖామణి, ఆదిలాబాద్‌లో - పవార్ కృష్ణ పోటీ చేస్తారని ఆయన పేర్కొన్నారు. మిగతా మూడు పార్లమెంట్ నియోజకవర్గాలకు అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్, అన్నెల లక్ష్మణ్, కేడల ప్రసాద్, హరీష్‌గౌడ్, రాఘవేంద్ర ముదిరాజ్, వినోద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తున్న డాక్టర్ విశారదన్ మహారాజ్

## భర్త వేధింపులకు మహిళ ఆత్మహత్య

గాజులరామారం, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి కట్నం కోసం భార్యను నిత్యం వేధించడంతో ఓ మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సూరారం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సూరారం లక్ష్మీనగర్‌కు చెందిన నర్సింహులు కూతురు పల్లవి(22) ఉప్పల్‌కు చెందిన అమర్ సాయితో కొన్ని రోజుల క్రితం వివాహం అయింది. వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చి ఘనంగా వివాహం చేశారు. కొన్ని రోజులు వీరి జీవితం సజావుగా సాగింది. తాగుడుకు బానిసైన అమర్‌సాయి తన భార్యను కట్నం తీసుకురావాలని వేధించడం, కొట్టడం చేసేవాడు. భర్త పెట్టే బాధలు భరించలేని పల్లవి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

# పుస్తెల తాడు అపహరించిన వ్యక్తి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు

వనస్థలిపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో పుస్తెల తాడు అపహరించిన పాత నేరస్తుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ వెనుకాల ఈ సేవా సమీపంలో ఉన్న ఇంట్లో నిద్రిస్తున్న మంగిశెట్టి భాగ్యలక్ష్మి మెడలోని మూడున్నర తులాల పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తి అపహరించిన విషయం తెలిసిందే. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు బుధవారం ఎన్జీవోస్ కాలనీలో ఒక పాత నేరస్తుడు ఓ జ్యువెలరీ షాపు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. వనస్థలిపురం సాహెబ్‌నగర్ వీకర్ సెక్షన్‌కు చెందిన గొను గండ్ల రాజేష్(25) జీహెచ్ఎంసీలో లేబర్ పనులు నిర్వహిస్తాడు. ఈ నెల 14న తెల్లవారు జామున ఇంట్లో నిద్రిస్తున్న మంగిశెట్టి భాగ్యలక్ష్మి మెడలోని మూడున్నర తులాల పుస్తెల తాడును దొంగిలించినట్లు నిజం ఒప్పుకున్నాడు. ఆ బంగారు పుస్తెల తాడును అమ్మడానికి జ్యువెలరీ షాపుకు వచ్చినట్లు పోలీసులు తెలిపాడు. అతని వద్ద ఉన్న మూడున్నర తులాల పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరితగతిని ఛేదించిన వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, డీఐ రవికుమార్ ఇతర సిబ్బందిని ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ అభినందించి, రివార్డుకు సిఫార్సు చేశాడు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న పుస్తెలతాడు

### ఐఎస్‌సదన్‌లో చైన్ స్నాచింగ్

సంతోష్‌నగర్ : నడుచుకుంటూ వెళ్తున్న యువతి మెడలో నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు బంగారు గొలుసు దొంగిలించిన సంఘటన మంగళవారం ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్ వినయ్‌నగర్‌కాలనీలోని లక్ష్మి హాస్టల్‌లో ఉంటున్న యువతి(19) బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతుంది. మంగళవారం సాయంత్రం పని నిమిత్తం బయటకు వెళ్లి రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఐఎస్‌సదన్ బస్టాపులో బస్సు దిగి హాస్టల్‌కి నడుచుకుంటూ వస్తుండగా వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్దకు రాగానే ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు యువతి మెడలోని 13గ్రాముల బంగారు గొలుసును తెంపుకొని పరారయ్యారు. దీనిపై యువతి ఐఎస్ సదన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంఘటనా స్థలంలో ఉన్న సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్నారు.

## అందుబాటులోకి మరిన్ని ఎలక్ట్రిక్ నాన్ ఏసీ బస్సులు

- 2024 డిసెంబర్ నాటికి వెయ్యి
- చర్యలు తీసుకుంటోన్న అధికారులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో బస్సుల సంఖ్య పెంచుకోవడమే లక్ష్యంగా ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. ఈ మధ్య అందుబాటులోకి తెచ్చిన 23 ఎలక్ట్రిక్ నాన్ ఏసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ 80-90 శాతం నమోదవుతోంది. వీటికి ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తుండడంతో అదే తరహాలో విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి 125-150 బస్సులను అందుబాటులోకి తెచ్చే దిశగా ఆర్టీసీ ప్రయత్నాలు చేస్తుంది. ఎలక్ట్రిక్ బస్సులకు దేశవ్యాప్తంగా డిమాండ్ నెలకొనడంతో బస్సుల రాకలో కొంత జాప్యం జరుగుతుందని ఆర్టీసీకి చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణంతో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. మహాలక్ష్మి పథకానికి ముందు సిటీబస్సుల్లో రోజుకు ఐదులక్షల మంది మహిళలు ప్రయాణాలు సాగిస్తే మహాలక్ష్మి ఉచిత పథకంతో రోజు వారీ మహిళా ప్రయాణికుల సంఖ్య 11లక్షలకు పెరిగింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచేందుకు ఉన్న అవకాశాలపై టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక దృష్టిసారించిందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. 2019కి ముందు గ్రేటర్‌జోన్‌లో ఆర్టీసీ 3,800 బస్సులు నడుపుతూ రోజుకు 33లక్షల మంది ప్రయాణికులకు సేవలందించింది. ప్రస్తుతం 2,661 బస్సులతో రోజుకు 21లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తోంది. 2024 డిసెంబర్ నాటికి 450 ఎలక్ట్రిక్ బస్సులు మరో 500కు పైగా డీజిల్ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఎలక్ట్రిక్ బస్సులు పెంచుకుంటే డీజిల్ ఖర్చుల భారం తగ్గడంతోపాటు ఆదాయం పెరుగుతుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మైనంపల్లి, అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి

## మతం పేరిట రాజకీయాలు సరికాదు

- మల్కాజిగిరి అభివృద్ధికి నాది బాధ్యత
- పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మైనంపల్లి

మల్కాజిగిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మతం పేరిట రాజకీయాలు మంచిది కాదని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన తప్పులను మళ్లీ చేయకుండా కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. అభ్యర్థి పట్నం సునీతారెడ్డితో కలిసి మల్కాజిగిరిలో పార్లమెంట్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రం భ్రష్టుపట్టిందని, సెక్రటేరియట్, యాదాద్రి దేవాలయం కట్టినంత మాత్రాన దీన్నే అభివృద్ధి అంటారా.. అని ప్రశ్నించారు. ఎంత ఖర్చుపెట్టాం.. ఎంత సంపాదించుకుందాం అన్నరీతిలో ప్రస్తుత రాజకీయాలు ఉన్నాయని, అలాంటి వాటికి కాంగ్రెస్ దూరమన్నారు. మల్కాజిగిరి నుంచి తనను గెలిపిస్తే ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి లోక్‌సభలోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి సునీతారెడ్డి హామీనిచ్చారు.

### నగరంలో తమిళభవన్

ఈసమావేశంలో హైదరాబాద్ యునైటెడ్ తమిళ అసోసియేషన్ కాంగ్రెస్‌కు పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటించింది. అసోసియేషన్ ప్రతినిధులు సాయికాంత్, వినయ్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తమిళులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, నగరంలో తమిళభవన్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కొలను హన్మంతరెడ్డి, వజ్రేష్‌యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, రమేష్, శోభారాణి, జ్యోత్స్న పాల్గొన్నారు.